

సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

బంజారాహిల్స్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో వేగం పెంచాల్సిన అవసరం ఉందని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ అన్నారు. ఇందిరానగర్‌లో రూ. 18 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన గురువారం పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, డివిజన్‌లో సీసీ రోడ్డు లేని ప్రాంతాలను ఇప్పటికే గుర్తించామని, అన్నిచోట్ల కొత్త రోడ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు.



బీజేఆర్‌నగర్‌లో పాత పాఠశాల భవనాన్ని కూల్చి వేస్తున్న దృశ్యం

ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి రూ.35 లక్షల నిధులు

● పాత భవనం కూల్చివేత పనులు మొదలు

బంజారాహిల్స్, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి విద్యాశాఖ 35 లక్షల రూపాయలు కేటాయించింది. దీంతో పాత భవనం కూల్చివేత పనులు మొదలయ్యాయి. ఫిలింనగర్ బీజేఆర్‌నగర్‌లో 'నీటిలో మునిగి...మట్టిలో కూరుకుపోయిన ప్రభుత్వ పాఠశాల' శీర్షికతో ఆంధ్రజ్యోతి ఈనెల 1వ తేదీని ప్రచురించిన కథనానికి విద్యాశాఖ స్పందించింది. పాఠశాలకు నూతన భవనం నిర్మించేందుకు నిధులు కేటాయిస్తూ జీఓ విడుదల చేసింది. దీంతో అధికారులు బుల్డోజర్‌తో పాత భవనం కూల్చివేత పనులను గురువారం మొదలు పెట్టారు. అన్ని వసతులతో కూడిన పాఠశాల భవనాన్ని త్వరగా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సమావేశంలో పాల్గొన్న తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా శాఖ ప్రతినిధులు

బకాయి డీఏలను నగదు రూపంలో చెల్లించాలి

●టీజీఓ హైదరాబాద్ జిల్లా సంఘం డిమాండ్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేసి నగదు రూపంలో చెల్లించాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. గురువారం ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో సంఘం కార్యవర్గ సమావేశం జరగ్గా.. పలు అంశాలపై తీర్మానాలు చేశారు. ఉద్యోగుల, పెన్షనర్ల సమన్వయ సహకారంతో కాంట్రిబ్యూషన్ సమాన నిష్పత్తిలో చేసి ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఇ.హెచ్.ఎస్)ను వెంటనే అమలు చేయాలని, ట్రస్టులో ఉద్యోగులకు సమాన భాగస్వామ్యం కల్పించాలని నిర్ణయించారు. సీపీఎస్, యూపీఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, తెలంగాణ రెండవ పీఆర్‌సీ రిపోర్టును వెంటనే తెప్పించుకొని ఉద్యోగులకు మెరుగైన ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్ జీపీఎఫ్, మెడికల్ బిల్లులు, అన్ని రకాల బకాయిలను చెల్లించాలని, జిల్లా స్థాయి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఆఫీసర్స్ కమిటీని పునరుద్ధరించాలని, టీజీఓ హైదరాబాద్ జిల్లా శాఖ సంఘ భవనం నిర్మించుకొనేందుకు వెయ్యి గజాలకు తక్కువ కాకుండా హైదరాబాద్ జిల్లా పరిధిలో స్థలం కేటాయించాలని తీర్మానాలు చేశారు. ఎంబీ కృష్ణ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీజీఓ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏలూరి శ్రీనివాసరావు, ఎ.సత్యనారాయణ, హైదరాబాద్ కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్, కేంద్ర సంఘ కోశాధికారి ఎం ఉపేందర్ రెడ్డి, మహిళా ప్రతినిధి దీపా రెడ్డి పాల్గొన్నారు.



సూత్రా ఎగ్జిబిషన్ ప్రారంభం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఫ్యాషన్ పట్ల అభిరుచి కలిగిన వారి కోసం బంజారాహిల్స్‌లోని హోటల్ తాజ్‌కృష్ణలో సూత్రా ఎగ్జిబిషన్ గురువారం ప్రారంభమైంది. ఈనెల 14వ తేదీ వరకు.. ప్రతి రోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఎగ్జిబిషన్‌లో ఉంచిన విస్తృతశ్రేణి వస్త్రాలు, దేశం నలుమూలల నుంచి తెచ్చిన తాజా డిజైనర్ కలెక్షన్స్, గృహ అలంకరణ వస్తువులు వినియోగదారులను ఇట్టే ఆకర్షిస్తాయని అన్నారు. ముంబై, ఢిల్లీ, జైపూర్, పూణె, ఇండోర్, రాయ్‌పూర్, అహ్మదాబాద్, బెంగళూరు, భోపాల్, సూరత్, పాట్నా, కొల్హాపూర్, కోయంబత్తూరు, మంగుళూరు తదితర నగరాల నుంచి తెచ్చిన లైఫ్‌స్టైల్ బ్రాండెడ్ వస్తువులు సూత్రా ప్రదర్శనలో అందుబాటులో ఉంచామన్నారు. రేఖ జ్యువెలరీ, రాధారాణి కోల్‌కతా, మహాలక్ష్మి జ్యువెలర్స్, ఓం జగదాంబ క్రియేషన్స్, డిజైనర్ ఫుట్‌వేర్, హ్యాండ్లూమ్ డిజిటల్, హ్యాండ్ పాట్స్ తదితర వస్తువులను ప్రదర్శనలో ఉంచామన్నారు. ప్రవేశం ఉచితమని, సూత్రా ప్రదర్శనను సందర్శించిన ఖాతాదారులు షాపింగ్ చేయడంలో మధురానుభూతిని పొందుతారని నిర్వాహకులు అన్నారు.

రేపు కురుమల ఆత్మగౌరవ భవనం ప్రారంభం

తార్నాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోకాపేట్‌లో ఈ నెల 14న దొడ్డి కొమరయ్య కురుమల ఆత్మగౌరవ భవనం ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో తెలంగాణ రాష్ట్ర కురుమ విద్యార్థి సంఘం నాయకులు కమలాకర్, డాక్టర్ ఏలేందర్ తదితరులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల 14న కోకాపేట్‌లో ప్రారంభించనున్న దొడ్డి కొమరయ్య కురుమల ఆత్మగౌరవ భవనం ప్రారంభోత్సవానికి తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, సిద్ధిరామయ్య, హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. దొడ్డి కొమరయ్య ఉద్యమ స్ఫూర్తితో కురుమ సామాజికవర్గానికి చెందిన ప్రతి ఒక్కరూ భవన ప్రారంభోత్సవానికి హాజరై కురుమల ఐక్యతను చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కురుమ విద్యార్థి సంఘం నాయకులు డా. బర్ల మహేందర్, కురువ మహేష్, జక్కుల అనిల్, కృష్ణ, అశోక్, మధు తదితరులు పాల్గొన్నారు.

రక్తం పీల్చేస్తున్నాయ్!

● అటకెక్కిన ఫాగింగ్
● బస్తీల్లో దోమల దండయాత్ర
● ఫాగింగ్ చేయకుండానే చేసినట్టు నమోదు
● అనారోగ్యం పాలవుతున్న బోరబండ బస్తీల జనం



ఎస్పార్టీ నగర్‌లో చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు

బోరబండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దోమల దండయాత్ర చేస్తున్నాయి. ఇంటా బయట అనే తేడా లేకుండా ప్రజల రక్తాన్ని పీల్చేస్తున్నాయి. ఫలితంగా ప్రతి బస్తీలో అనారోగ్యం బారిన పడుతున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఇంత జరుగుతున్నా జీహెచ్ఎంసీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. సిబ్బంది ఫాగింగ్ చేయకపోయినా చేసినట్టు బలవంతంగా స్థానికులతో సంతకాలు పెట్టించుకొని వెళ్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విధులపై సిబ్బంది నిర్లక్ష్యం

కాలనీలు, బస్తీల్లో దోమల నియంత్రణకు చర్యలు చేపట్టడంలో జీహెచ్ఎంసీ సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రసాయనాల పిచికారీ, ఫాగింగ్ వంటివి చేయడం లేదని వాపోతున్నారు. ఇళ్లలోని నీటి సంపులు, తాగునీటి ట్యాంక్‌ల్లో బ్లీచింగ్ పౌడర్‌ను నెలలో రెండు, మూడుసార్లు నామమాత్రంగా చల్లి చేతులు దులుపుకుంటున్నారని అంటున్నారు. ఇళ్ల ఆవరణలో నీరు నిల్వ ఉండే ప్రదేశాలు, పూలకుండీల వద్ద దోమలు వృద్ధి చెందకుండా రసాయనాలను పిచికారీ చేయాల్సిన ఎంటమాలజీ సిబ్బంది ఆ పనిపై నిర్లక్ష్యం చేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాలనీలు, బస్తీల్లో కొన్ని ఇళ్లలోనే దోమల నివారణ మందును పిచికారీ చేస్తున్న సిబ్బంది అన్ని ఇళ్ల గోడలపై మాత్రం మందు పిచికారీ చేసినట్టు నమోదు చేస్తున్నారని స్థానికులు చెప్తున్నారు. బోరబండ డివిజన్‌లోని సైట్-3, వీకర్ సెక్షన్ బస్తీలు, బంజారానగర్, అన్ననగర్, ఎస్పార్టీ నగర్, సాయిబాబా నగర్‌లలో దోమల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయని ఆయా బస్తీలు, కాలనీల ప్రజలు వాపోతున్నారు.

నిధులు, సిబ్బంది ఉన్నా..

బోరబండలో అత్యధికంగా మురికివాడలు, బస్తీలు ఉన్నాయి. బస్తీల్లోని ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని దోమల నివారణ కోసం జీహెచ్ఎంసీ లక్షల రూపాయలు కేటాయించడంతో పాటు అవసరమైన సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచింది. విధులపై జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది నిర్లక్ష్యం చేయడంతో ప్రజలకు దోమల బెడద మాత్రం తప్పడం లేదు. దోమల నివారణకు కనీసం నెలలో ఒక్కసారి కూడా ఫాగింగ్ చేయడం లేదని, గత ఆరునెలలుగా తమ కాలనీల్లో ఫాగింగ్ చేయలేదని సాయిబాబా నగర్, ఎస్పార్టీ నగర్‌వాసులు ఆరోపిస్తున్నారు.

సైట్-3తో పాటు పలు బస్తీల్లో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో సమీపంలోని ఇళ్ల వారు చెత్తను పడవేస్తున్నారు. ఈ చెత్తను పారిశుధ్య కార్మికులు తొలగించకపోవడంతో దోమలు విజృంభించి విష జ్వరాల బారిన పడుతున్నామని బస్తీవాసులు తెలిపారు. ఇప్పటికైనా బస్తీల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ చేసి దోమల వృద్ధిని అడ్డుకొని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫాగింగ్ చేయకుండానే..



దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయకుండానే చేసినట్టుగా జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది ఇంటి గోడలు, గేట్లపై పెన్సిల్‌తో నమోదు చేస్తున్నారు. ఈ విషయంపై సిబ్బందిని నిలదీస్తే సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారు. ఉన్నత అధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

- సత్తమ్మ, ఎస్పార్టీ నగర్ నివాసి

దోమల మందు పిచికారీ చేయించండి



సైట్-3తో పాటు బస్తీల్లో కొన్ని నెలలుగా దోమల నివారణ మందును పిచికారీ చేయడం లేదు. దీంతో దోమలు వృద్ధి చెంది స్థానికులు డెంగీ, మలేరియా వంటి ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రి పాలవుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు సైట్-3తో పాటు బస్తీల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించాలని కోరుతున్నా.

- శంకర్, ఎస్పార్టీ నగర్ నివాసి

లక్ష డప్పులు.. వెయ్యి గొంతులతో దండోరా ప్రదర్శన

●జనవరి 27న నిర్వహిస్తాం
● మాదిగ కళాకారుల పట్ల ప్రభుత్వం వివక్ష
● ఎమ్మార్పీస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



కళాకారులతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఖైరతాబాద్,డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): వర్గీకరణ సాధించే దిశగా తుది ఘట్టంగా జనవరి 27న హైదరాబాద్‌లో లక్ష డప్పులు, వెయ్యి మంది కళాకారుల గొంతులతో దండోరా ప్రదర్శన, సభ ఉంటుందని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రకటించారు. గురువారం సోమాజిగుడ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ కళాకారులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం 9 మంది కళాకారులను గుర్తించి వారికి కోటి రూపాయల నగదు, తామ్ర పత్రం, 300 గజాల ఇంటి స్థలం ఇవ్వనున్నట్టు ప్రకటించడం సంతోకరమే అయినా ..వారిలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారు లేకపోవడం తమను వివక్షకు గురి చేయడమేనని అన్నారు. అందెశ్రీని కొందరు మాదిగ అని ప్రచారం చేస్తున్నారని, అయితే, తాను విశ్వనరుడనని ఆయన పేర్కొన్నారని, మాదిగనని ఎప్పుడు చెప్పలేదని అన్నారు. కళాకారుల ఎంపిక విషయంపై ప్రభుత్వం పునఃపరిశీలించి మాదిగ కళాకారులను గుర్తించాలని కోరారు. తెలంగాణ ప్రముఖుల్లో తెలంగాణ కోసం త్యాగం చేసిన వారిని విస్మరించారని, శిల్పి యాదగిరి రావును శాసన మండలికి పంపాలని డిమాండ్ చేశారు. కళాకారులు, ప్రముఖుల్లో మహిళలకు తగు ప్రాధాన్యమివ్వాలని, తెలంగాణ ఉద్యమాన్ని చెన్నారెడ్డి అనంతరం నడిపించిన టీఎన్ సదాలక్ష్మితో పాటు చాకలి ఐలమ్మ, కేశవరావు జాదవ్, విమలక్కలను ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. ఎస్సీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న మాల కులస్తులు సమాజంలో ఒంటరయ్యారన్నారు. డిసెంబరు 27 నుంచి అన్ని జిల్లాల్లో రథయాత్రలు నిర్వహించి దండోరా సభకు లక్ష డప్పులతో మాదిగలు వచ్చేలా చేస్తామన్నారు. ఈ ప్రదర్శన, సభకు మాదిగ కళాకారులు ప్రజాయుద్ధనౌక ఏపూరి సోమన్న అధ్యక్షత వహిస్తారన్నారు.

బహుజనుల తెలంగాణ తల్లిని ప్రతిష్ఠిస్తాం

తెలంగాణ తల్లులుగా కేసీఆర్, రేవంత్‌రెడ్డిలు పెట్టిన విగ్రహాలను తాము అంగీకరించబోమని, తాము అధికారంలోకి వస్తే చాకలి ఐలమ్మ రూపంలో ఉండే బహుజనుల తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించుకుంటామని మందకృష్ణ మాదిగ అన్నారు. సమావేశంలో మాదిగ కళాకారులు ఏపూరి సోమన్న, ఎస్ఎ అశోక్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ, కళాకారులు గిద్దె రాంనర్సయ్య, భరత్, మల్లెపాక అనిల్, గజ్జల అశోక్, డప్పు రమేష్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొ. హర్ష్ కే గుప్తా తదితరులు

విద్యార్థులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

తార్నాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎప్పటికప్పుడు నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని కేంద్ర సముద్రాభివృద్ధి శాఖ మాజీ కార్యదర్శి, పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రొ. హర్ష్ కే గుప్తా అన్నారు. అసోసియేషన్ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ జియోఫిజిసిస్ట్స్ (ఏఈజీ) గోల్డెన్‌జూబ్లీ ఉత్సవాల సందర్భంగా గురువారం ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన 'జియో ఎక్స్‌ప్లోరేషన్ ఫర్ క్రిటికల్ మినరల్స్ అండ్ ప్రీషియస్ మెటల్స్' అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై భౌగోళిక అన్వేషణ గణనీయమైన ప్రభావం చూపుతుందన్నారు. ఆర్థిక వృద్ధిలో కీలకమైన లోహాలు, విలువైన ఖనిజాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఈజీ ఉపాధ్యక్షుడు, జియోఫిజిక్స్ విభాగాధిపతి ప్రొ. వీరయ్య, ఫ్యాకల్టీ ఆఫ్ డీన్ ప్రొ. కరుణాసాగర్, ఓఎన్జీసీ బేసిన్ మేనేజర్ కరువణ్ణన్, జీఎస్ఐ మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ రామమూర్తి, చంద్రశేఖర్, డా. బి. నరసింహారావు, బాబు, జవహర్ పాల్గొన్నారు.

18న ఓయూలో కృతజ్ఞత సభ

● నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్

తార్నాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ నెల 18న ఓయూలో కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నామని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్ తెలిపారు. తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ రూం నంబర్ 57లో 'కాంగ్రెస్ ప్రభుత్వం - రేవంత్‌రెడ్డి ఏడాది పాలన' అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను గురువారం నిర్వహించారు. దాదాపు 200 మంది విద్యార్థులు వ్యాసరచన పోటీలలో పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ. 10వేలు, ద్వితీయ బహుమతి రూ. 5 వేలు, తృతీయ బహుమతి రూ. 3 వేలు నగదు బహుమతులను ఈ నెల 18న కృతజ్ఞత సభలో అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు డా. వరంగల్ రవి, రెడ్డి శ్రీను, బోనాల నగేష్, భీమ్‌రావ్ నాయక్, పెరుమాళ్ళ గుట్టయ్య గౌడ్, బైరు నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై నిర్మించిన గ్రీన్ బెల్ట్‌ను తొలగిస్తున్న ట్రాఫిక్, జీహెచ్ఎంసీ అధికారులు



ఫుట్‌పాత్‌పై ఉన్న గుడిసెను తొలగిస్తున్న సిబ్బంది

ఫుట్‌పాత్‌లను ఆక్రమించి అద్దెలకు..

గుడిసెలు వేసుకొని కాపురాలు!

కూల్చివేసిన అధికారులు

బంజారాహిల్స్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌లను కొందరు ఆక్రమించారు.. వీరిలో ఒకరు ఇంటి ముందు గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేసుకోగా.. మరొకరు వ్యాపారులకు అద్దెకిచ్చాడు.. ఇంకొకరు ఏకంగా టెంట్ వేసి ఇతరులతో కాపురం పెట్టించాడు. అధికారుల స్పెషల్ డ్రైవ్‌లో ఇలాంటివి అనేకం వెలుగులోకి వచ్చాయి. ట్రాఫిక్ సజావుగా సాగేందుకు ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు సంయుక్తంగా గురువారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లో ప్రధాన రోడ్లు, అంతర్గత రహదారుల్లో వెలసిన ఆక్రమణలను తొలగించారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద ఓ వ్యాపారి ఫుట్‌పాత్‌ను ఆక్రమించి తన షాపు కోసం ర్యాంప్ నిర్మించుకున్నాడు. దీంతో షాపునకు వచ్చే వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేయాల్సి వస్తోంది. బుల్డోజర్‌తో ఈ ర్యాంప్‌ను కూల్చివేశారు. ఇదే దారిలో ఓ ఇంటి యజమాని అసలే చిన్నగా ఉన్న రోడ్డును ఆక్రమించి గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు చేశాడు. దాన్ని కూడా అధికారులు తొలగించారు. కాగా, జూబ్లీహిల్స్ అపోలో ఎదుట ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన టిఫిన్ సెంటర్ తో పాటు మరో ఇద్దరు వ్యాపారుల వద్ద ఓ ఇంటి యజమాని ప్రతినెలా ఏకంగా రూ.2 లక్షలు తీసుకుంటున్నట్టు తేలింది. అధికారులు ఆ వ్యాపారాలను తొలగించి భవిష్యత్తులో మళ్లీ ఏర్పాటు చేయకుండా నోటీసు జారీ చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 7లో ఫుట్‌పాత్‌పై కొంతమంది టెంట్ వేయించారు. దానిని చూడగానే ఎవరి భద్రత కోసమో ఏర్పాటు చేశారని అనుకుంటాం. కానీ అందులో కొంత మంది కాపురం ఉంటున్నారు. వాటిని కూడా అధికారులు తీయించి వేశారు. ఈ సందర్భంగా పశ్చిమ మండలం ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ, హిల్స్‌లో ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వీఐపీ మూవ్‌మెంట్ అధికంగా ఉండటంతో సహజంగానే రాకపోకలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని, దీనికి తోడు ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు పెరిగిపోవడంతో ట్రాఫిక్‌జామ్ అవుతోందని అన్నారు. అందుకే ఈ ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగంతో కలిసి ప్రతి వారం ఈ డ్రైవ్ నిర్వహిస్తామ డీసీపీ తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్, ట్రాఫిక్, శాంతి భద్రతల విభాగం పోలీసులు పాల్గొన్నారు.



వాటర్ షెడ్ సపోర్ట్ సర్వీసెస్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంటున్న ఎస్‌యూఈఎస్ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్

భూగర్భ జలాల అభివృద్ధికి అడ్వాన్స్‌డ్ వాటర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్

బంజారాహిల్స్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాల అభివృద్ధి కోసం కళాశాలలో అడ్వాన్స్‌డ్ వాటర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నట్టు సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్ తెలిపారు. ఈ మేరకు కళాశాలలో గురువారం వాటర్‌షెడ్ సపోర్ట్ సర్వీసెస్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. కళాశాలలో వృథాగా పోయే ప్రతి నీటి బొట్టు భూమిలో ఇంకేలా ఈ ప్రాజెక్ట్ ఉపయోగపడుతుందన్నారు. రెయిన్ హార్వెస్టింగ్ ప్రాజెక్టును కూడా సిద్ధం చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు నీటిని వృథా చేయకుండా అవగాహన కలిగించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.



విరాళం చెక్కును అందజేస్తున్న ఎస్ఆర్‌నగర్ కమ్మ సేవా సమితి సభ్యుడు సూరినేని మోహన్‌నాయుడు, రాఘవ తదితరులు

సంక్రాంతి సంబరాలకు రూ.లక్ష విరాళం

బేగంపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 'సంక్రాంతి సంబరాలు-25' కార్యక్రమ నిర్వహణ కోసం ఎస్సార్‌నగర్ కమ్మ సేవా సమితి సభ్యుడు సూరినేని మోహన్‌నాయుడు రూ. లక్ష విరాళం ఇచ్చారు. కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ చైర్మన్ గూడూరు సత్యనారాయణకు గురువారం మణికొండలోని ఆయన నివాసంలో కలిసి విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, మన సంస్కృతీ సంప్రదాయాలకు జీవం పోసేందుకు ఈ సాయం తోడ్పాటు అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎస్సార్‌నగర్ కమ్మ సేవా సమితి ప్రతినిధులు ముక్కపాటి వీర రాఘవయ్య, మదమంచి రాజారావు, అనిల్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలో ప్రీక్రిస్మస్ వేడుకలు

చిలకలగూడ, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): ఏసు క్రీస్తు బోధనలు ఆచరణీయమని రెవరెండ్ డా. జాన్ వెస్లీ (రాజమండ్రి) తెలిపారు. మెట్టుగూడ డివిజన్ రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో దక్షిణ మధ్య రైల్వే క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డా.జాన్ వెస్లీ సందేశం ఇవ్వగా భక్తులు ఏసుక్రీస్తును స్మరిస్తూ గానం చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా రాష్ట్ర ఆరోగ్య శాఖ, కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగుతు, అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఆర్. అభిషేకనంద రావు, కార్యదర్శి బెన్‌హర్, నారాయణ, బిక్కీ రాంబబుతో పాటు రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ అభ్యర్థి మదనం గంగాధర్‌కు మద్దతు తెలుపుతూ అభివాదం చేస్తున్న ప్రతినిధులు

'గంగాధర్‌ను ఎమ్మెల్సీగా గెలిపించుకుందాం'

ఖైరతాబాద్,డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డీఎస్పీ ఉద్యోగాన్ని వదిలి ప్రజాసేవకు ముందుకు వచ్చిన మదనం గంగాధర్‌ను గెలిపించుకుందామని మేధావులకు పలు సంఘాలు విన్నవించాయి. గురువారం సోమాజిగుడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్సీ 57 ఉప కులాల ఐక్యవేదిక, తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, తెలంగాణ మాదిగ హక్కుల దండోరాలు సంయుక్తంగా గంగాధర్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. తెలంగాణ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ మాట్లాడుతూ, డీఎస్పీగా ఎంతో మందికి న్యాయం చేసిన గంగాధర్ తనకున్న ప్రభుత్వ సదుపాయాలను వదులుకొని ప్రజాసేవకు ముందుకు వచ్చారని, నిమ్న వర్గాల కుటుంబంలో పుట్టిన గంగాధర్ ఎన్నో కష్టాలను అధిగమించి పైకి వచ్చారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గంగాధర్‌ను బలపరచి ఆయన గెలుపుకు దోహదపడాలని కోరారు. సమావేశంలో ఎస్సీ 57 ఉప కులాల వ్యవస్థాపక అధ్యక్షుడు చింతల రాజలింగం, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు జున్ను కనకరాజు మాదిగ దండోరా యువజన అధ్యక్షుడు బాలకృష్ణ, ప్రతినిధులు బాలరాజు, తులసీరాం పాల్గొన్నారు.



వైద్య యంత్రాలను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ ఇందిర, ప్రొఫెసర్ శ్రవణ్

గాంధీ ఆస్పత్రికి గ్యాస్ట్రో పరికరాలు

అడ్డగుట్ట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం (టీడీఎఫ్) ఖరీదైన వైద్య పరికరాలను అందజేసింది. ఈ యంత్రాలను గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ ఇందిర, గ్యాస్ట్రో ఎంట్రలాజీ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రవణ్ చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ ఆహార పదార్థాలను అతి కష్టంగా మింగడం, గుండెల్లో మంట నాన్ కార్డియాక్ గుండెనొప్పి వంటి వివిధ రుగ్మతలు (ఎసోఫాటియల్ మెటాలిటీ డిజార్డర్స్) వల్ల ఉత్పన్నమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో మోనోమెట్రీ ఆల్ ఇండియా సొసైటీ అధ్యక్షుడు కిమ్స్ ఆస్పత్రి వైద్యుడు నితిష్ ప్రతాప్, టీడీఎఫ్ ప్రతినిధులు మట్టా రాజేశ్వర్ రెడ్డి, డాక్టర్ దినేష్ అనిరెడ్డి, గాంధీ మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ రవి శేఖర్‌రావు, ఆర్ఎంఒ1 శేషాద్రి, పీజీ వైద్యులు అనిల్, ధ్రువ, ప్రియాంక, స్నేహిత, వివేక్ పాల్గొన్నారు.



గాంధీ మెడికల్ కాలేజీ మైదానంలో కసరత్తు చేస్తున్న వైద్య విద్యార్థులు

వాలీబాల్ పోటీలకు వైద్య విద్యార్థుల కసరత్తు

అడ్డగుట్ట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాళోజీ నారాయణ రావు విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 22 వరకు కేరళ, తిరువనంతపురంలో నిర్వహించే వాలీబాల్ సౌత్ జోన్, ఇంటర్ విశ్వవిద్యాలయం టోర్నమెంట్ పోటీల్లో గాంధీ మెడికల్ కాలేజీకి చెందిన ఐదుగురు వైద్య విద్యార్థులు జీవన్, యువరాజ్, కిశోర్, అరుణ్, శ్రీకర్‌లు ఎంపికయ్యారని కాలేజీ ప్రిన్సిపల్ ఇందిర, వైస్ ప్రిన్సిపల్ రవి శంకర్, డాక్టర్ వినోద్, ఫిజికల్ డైరెక్టర్ వేణు తెలిపారు.



స్థానికులతో సమస్యలపై చర్చిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

బౌద్ధనగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ వేంకటేశ్వరనగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ సామల హేమ పరిశీలించారు. సుమారు రూ.14 లక్షలతో ఈ పనులను చేపట్టామని, నాణ్యతతో రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. అనంతరం సమస్యలపై స్థానికులతో చర్చించారు. స్థానిక మహిళలు కార్పొరేటర్‌కు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, నాయకులు యాదగిరి, గౌతమ్, శంకర్, లక్ష్మి, లలిత, అర్చన పాల్గొన్నారు.



అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత తదితరులు

వైభవంగా అయ్యప్పస్వామికి పూజలు

సికింద్రాబాద్, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్క్‌లేన్ వద్ద ముచ్చర్ల మెన్షన్‌లో గడిచిన 52 రోజులుగా అయ్యప్పస్వామి పూజలు, అన్నప్రసాద పంపిణీ వైభవంగా జరుగుతున్నాయి. గురువారం రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిట్టు, రాగీరు ఆనంద్‌బాబు, శివ నారాయణగుప్తా పాల్గొన్నారు.

రేపు జిల్లాలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్‌అదాలత్

- రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి



జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 14న రంగారెడ్డి జిల్లాలోని అన్ని కోర్టులలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి. శ్రీదేవి తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇదివరకు కోర్టు ముందుకు రాని కేసులు కానీ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులను కానీ రాజీమార్గం ద్వారా పరిష్కరించుకునే వేదిక ఈ లోక్‌అదాలత్ అని చెప్పారు. లోక్ అదాలత్‌లో కేసు దాఖలు చేసినప్పుడు కోర్టు రుసుము కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న సివిల్‌కేసు లోక్ అదాలత్‌కు పంపబడి, ఆ తర్వాత పరిష్కరించబడినట్లయితే వాస్తవానికి కోర్టులో చెల్లించిన కోర్టు రుసుము కూడా కక్షిదారులకు తిరిగి చెల్లించబడుతుందన్నారు. లోక్‌అదాలత్‌లో కేసు పరిష్కరించుకుంటే ఇరు పక్షాలు గెలిచినట్లేనన్నారు. ఈ లోక్‌అదాలత్‌ల ద్వారా సమయం, డబ్బు వృథా కాకుండా ఉంటుందని చెప్పారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, కుటుంబ తగాదా కేసులు, మోటారు వాహనాల ప్రమాదాల కేసులు, చిట్‌ఫండ్ కేసులు, ఎలక్ట్రిసిటి కేసులు, చెక్కు బౌన్స్ కేసులు ఇతర రాజీకి వీలున్న కేసులు సులభంగా పరిష్కరించుకోవచ్చని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. రాజీమార్గమే రాజమార్గమని ఆమె అన్నారు.

గాత్రం, నాట్యం..

- కళాకారులకు నిలయం ప్రభుత్వ నృత్య కళాశాల
- సంగీతం, కూచిపూడి, భరత నాట్యం వీణా, వయొలిన్, మృదంగంలో శిక్షణ
- 1962లో మారేడుపల్లిలో 12 మందితో ప్రారంభం
- నేడు శిక్షణపొందుతున్న 542 మంది
- నిష్ణాతులతో శిక్షణ, డిప్లొమా కోర్సులు



త్యాగరాయ ఉత్సవాల్లో ప్రదర్శన ఇస్తున్న కళాకారులు



భక్తరామదాసు సంగీత కళాశాలలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

చిలకలగూడ డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీ భక్త రామదాసు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల సికింద్రాబాద్, ఈస్ట్ మారేడుపల్లిలో 1966లో 12 మంది విద్యార్థులతో ప్రారంభమయింది. నేడు 542 మందితో సంగీత, నృత్య, వాద్యాలలో శిక్షణ పొందుతున్నారు. ప్రముఖ సంగీత విద్వాంసులు నూకల చిన సత్యనారాయణ, శ్రీరంగం గోపాలరత్నం వంటి వారు ప్రిన్సిపల్స్‌గా వ్యవహరించి కళాశాల ప్రగతికి పునాదులు వేయగా దుడ్డుసీతారామయ్య, వరలక్ష్మీ, హరిప్రియ వంటి ఉపాధ్యాయులు కళాకారులను తీర్చిదిద్దారు. ఇండియన్ ఐడల్ విజేతగా నిలిచిన శ్రీరామచంద్ర, తబలా వాద్యంలో రాణిసున్న చంద్రకాంత్ ఈ కాలేజీ విద్యార్థులే.

కళాశాల విద్యార్థులకు అతి తక్కువ ఖర్చుతో కర్ణాటక, హిందూస్తానీ గాత్రం కూచిపూడి, భరత నాట్యం, పేరిణీ నృత్యాలు, వీణ, వయొలిన్, మృదంగం, సితార్, తబలలో నిష్ణాతులచే శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులలో సర్టిఫికెట్లు అందజేస్తున్నారు.



భక్తరామదాసు సంగీత కళాశాల భవనం

ప్రతియేడాది జూన్‌లో అడ్మిషన్లు

ప్రతి సంవత్సరం జూన్‌లో అడ్మిషన్లు ప్రారంభమవుతాయి. కనీస వయసు పదేళ్లు. గరిష్ఠ వయసు పరిమితి లేదు. విద్యార్థులు తమ వెంట ఎటువంటి వాద్య పరికరాలు తీసుకురావలసిన అవసరం లేదు. వీణ, వయొలిన్, తబల, మృదంగం వంటివి కాలేజీలో అందుబాటులో ఉంచారు. కళాశాల పనివేళలు మధ్యాహ్నం 2నుండి సాయంత్రం 7గంటల వరకు ఉంటుంది. సర్టిఫికెట్ కోర్సుకి రూ.1100, డిప్లొమా కోర్సుకి రూ.1500 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

శాశ్వత భవనం నిర్మించాలి

అద్దె భవనం: ప్రస్తుతం కాలేజీ ఈస్ట్ మారేడుపల్లి, ఐసీఐసీఐ బ్యాంకు వెనుక నెలకొని వుంది. శాశ్వత భవనం లేక తరచూ కాలేజీని మార్చటం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకి గురవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాల్సి వుంది. గతంలో మారేడుపల్లి పాలిటెక్నిక్ కళాశాలలో కొంత స్థలం కేటాయించి నిర్మాణానికి చేసిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి.

ఉత్సవాలు, జయంతులు: విద్యార్థులలో దాగివున్న ప్రతిభను వెలికి తీయడానికి ప్రతి నెలా కళార్చన పేరిట కార్యక్రమం నిర్వహిస్తుంటారు. త్యాగరాజ ఆరాధన, భక్త రామదాసు జయంతి, ఎం.ఎస్. సుబ్బలక్ష్మీ జయంతులు నిర్వహిస్తూ ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహిస్తుంటారు.

ఇండియన్ ఐడల్: జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో సత్తా చాటి ఇండియన్ ఐడల్‌గా నిలిచిన శ్రీరామచంద్ర, తబలా వాద్యంలో రాణిస్తున్న మృదంగం కళాకారుడు చంద్రకాంత్‌లు ఈకాలేజీ విద్యార్థులే.

తక్కువ ఖర్చుతో శిక్షణ



రాష్ట్ర ప్రభుత్వం అతి తక్కువ ఖర్చుతో శాస్త్రీయ సంగీత, వాద్య నృత్యాలలో నిష్ణాతులచే శిక్షణ అందజేస్తున్నది. విద్యార్థులు ఎటువంటి వాద్య పరికరాలు వెంట తీసుకు రావలసిన అవసరం లేదు. అన్ని కాలేజీలలో వీటిని అందజేస్తారు.

\- మహావాది సరిత, ప్రిన్సిపల్

ఏప్రిల్, మేలో కూడా క్లాసులు ఉండాలి



ఈ కాలేజీలో కర్ణాటక గాత్రం కొద్ది రోజులు నేర్చుకున్నా. అప్పుడు ప్రిన్సిపల్ శ్రీరంగం గోపాలత్నం ఉండేవారు. వేసవి ఏప్రిల్, మే నెలల్లో కాలేజీకి సెలవులు ఇవ్వకుండా క్లాసులు నిర్వహిస్తే బాగుంటుంది. కాలేజీలు, పాఠశాలలకి సెలవులు ఉండటంతో సంగీతం, నృత్యం నేర్చుకునే వారికి అనుకూలంగా ఉండి విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది.

\- అరుణ, మాజీ విద్యార్థి

సికింద్రాబాద్‌లో ఎగిరిన ఎర్ర జెండా

- రైల్వే గుర్తింపు ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్‌కు భారీ మెజార్టీ



సికింద్రాబాద్‌లో సంబరాలు జరుపుకుంటున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ మధ్య రైల్వే కేంద్రీయ స్థాయిలో నిర్వహించిన సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ రైల్వే మజ్దూర్ యూనియన్ భారీ మెజార్టీతో విజయకేతనం ఎగురవేసింది.

పోటీలో ఉన్న రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఘోర పరాజయం కావడంతో ఫలితాల అనంతరం రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు నృత్యాల మధ్య సంబురాలు జరుపుకున్నారు. దక్షిణ మధ్య రైల్వే సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికలు ఈనెల 4, 5, 6 మూడు రోజుల్లో కేంద్రీయ స్థాయిలో దక్షిణ మధ్య రైల్వేలో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ (కాంగ్రెస్), రైల్వే కార్మికుల సంఘ్ (బీజేపీ)లతో పాటు కొన్ని యూనియన్లు ఎన్నికల్లో పోటీ చేశాయి. గురువారం విడుదలైన ఫలితాల్లో సికింద్రాబాద్ డివిజన్‌లో రైల్వే కార్మిక సంఘ్‌కు 1467 ఓట్లు రాగా, రైల్వే ఎంప్లాయిస్ సంఘ్‌కు 6,575 ఓట్లు, దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఎర్రజెండా గుర్తుపై 9,238 ఓట్లు పోలయ్యాయి. సాయంత్రం వరకు ఫలితాలు రావడంతో రైల్వే మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, సికింద్రాబాద్ డివిజన్ కార్యదర్శి పి.రవీందర్ ఆధ్వర్యంలో రాత్రి సికింద్రాబాద్ అన్ని రైల్వే కార్యాలయాలతో పాటు రైల్ నిలయం ఎదురుగా ఉన్న హైద్రాబాద్ భవన్, రైల్వే సంచాలన్ భవన్ కార్యాలయాల ముందు వేల మంది రైల్వే మజ్దూర్ యూనియన్ కార్మికులు ఉద్యోగులు వేడుక జరుపుకున్నారు.

జనవరి 27న లక్ష డప్పులు...

- వెయ్యి గొంతులతో దండోరా ప్రదర్శన
- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



కళాకారులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఖైరతాబాద్,డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): వర్గీకరణ సాధించే దిశగా తుది ఘట్టంగా జనవరి 27న హైదరాబాద్‌లో లక్ష డప్పులు, వెయ్యి మంది కళాకారుల గొంతులతో దండోరా ప్రదర్శన, సభ ఉంటుందని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రకటించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ కళాకారులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం 9 మంది కళాకారులను గుర్తించి వారికి కోటి రూపాయల నగదు, తామ్ర పత్రం, 300 గజాల ఇంటి స్థలం ఇవ్వనున్నట్టు ప్రకటించడం సంతోకరమే అయినా.. వారిలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారు లేకపోవడం తమను వివక్షకు గురిచేయడమేనన్నారు. అందెశ్రీని కొందరు మాదిగ అని ప్రచారం చేస్తున్నారని, అయితే, తాను విశ్వనరుడనని ఆయన పేర్కొన్నారని, మాదిగనని ఎప్పుడూ చెప్పలేదని అన్నారు. కళాకారుల ఎంపిక విషయంపై ప్రభుత్వం పునఃపరిశీలించి మాదిగ కళాకారులను గుర్తించాలని కోరారు. తెలంగాణ ప్రముఖుల్లో తెలంగాణ కోసం త్యాగం చేసిన వారిని విస్మరించారని, శిల్పి యాదగిరిరావును శాసన మండలికి పంపాలని డిమాండ్ చేశారు. కళాకారులు, ప్రముఖుల్లో మహిళలకు తగు ప్రాధాన్యమివ్వాలని, తెలంగాణ ఉద్యమాన్ని చెన్నారెడ్డి అనంతరం నడిపించిన టీఎన్ సదాలక్ష్మితో పాటు చాకలి ఐలమ్మ, కేశవరావు జాదవ్, విమలక్కలను ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. ఎస్సీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న మాల కులస్తులు సమాజంలో ఒంటరయ్యారన్నారు. డిసెంబరు 27 నుంచి అన్ని జిల్లాల్లో రథయాత్రలు నిర్వహించి దండోరా సభకు లక్ష డప్పులతో మాదిగలు వచ్చేలా చేస్తామన్నారు. ఈ ప్రదర్శన, సభకు మాదిగ కళాకారులు ప్రజా యుద్ధనౌక ఏపూరి సోమన్న అధ్యక్షత వహిస్తారన్నారు.

బహుజనుల తెలంగాణ తల్లిని ప్రతిష్ఠిస్తాం

తెలంగాణ తల్లులుగా కేసీఆర్, రేవంత్‌రెడ్డిలు పెట్టిన విగ్రహాలను తాము అంగీకరించబోమని, తాము అధికారంలోకి వస్తే చాకలి ఐలమ్మ రూపంలో ఉండే బహుజనుల తెలంగాణ తల్లిని ప్రతిష్ఠించుకుంటామని మందకృష్ణ మాదిగ అన్నారు. సమావేశంలో మాదిగ కళాకారులు ఏపూరి సోమన్న, ఎస్ఐ అశోక్, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ, కళాకారులు గిద్దె రాంనర్సయ్య, భరత్, మల్లెపాక అనిల్, గజ్జల అశోక్, డప్పు రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

బీసీలకు 8 మంత్రి పదవులు కేటాయించాలి

- జాజుల శ్రీనివాస్‌గౌడ్

బర్కత్‌పుర, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలోనే చేపట్టనున్న మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయం పాటించాలని, బీసీలకు 8 మంత్రి పదవులు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో కేవలం ఇద్దరు బీసీలు మంత్రులుగా కొనసాగుతున్నారని, 55 శాతం జనాభా ఉన్న బీసీలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. మంత్రివర్గంలో రెడ్లకు, వెలమలకు మాత్రమే న్యాయం జరిగిందన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అగ్రవర్ణాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీలు తిరుగుబాటు చేసి గుణపాఠం చెప్పారని, కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా అదే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. గౌడ కులస్తులకు చెందాల్సిన ఎక్సైజ్ శాఖను వెలమ కులానికి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ విషయంపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత రాహుల్‌గాంధీకి లేఖ రాస్తామన్నారు. బీసీల మంచితనాన్ని బలహీనంగా భావిస్తే రాజకీయ సమాధి చేస్తామని హెచ్చరించారు. మంత్రివర్గ విస్తరణలో బీసీలకు అన్యాయం జరిగితే సహించబోమని, భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు కుందారం గణేశ్‌చారి, బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్, విక్రమ్‌గౌడ్, ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, అయిలి వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనం నుండి కిందపడిన విద్యార్థి

- తీవ్రగాయాలు, కేసు నమోదు



ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

బోయిన్‌పల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాల రెండవ అంతస్తు భవనం నుండి కిందపడిన ఘటనలో తీవ్ర గాయాలైన విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. విద్యార్థి కుటుంబ సభ్యులు బోయిన్‌పల్లి, కార్ఖాన పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం.. బోయిన్‌పల్లి సౌజన్యకాలనీకి చెందిన అశోక్‌రెడ్డికి కూతురు, కుమారుడు ఉన్నారు. వీరు కవల పిల్లలు కాగా బోయిన్‌పల్లి పల్లవి మోడల్ స్కూల్‌లో చదువుతున్నారు. 9వ తరగతి చదువుతున్న తనీష్‌రెడ్డి గురువారం రోజులాగే పాఠశాలకు వెళ్లాడు. ఈ క్రమంలో పాఠశాల ముగిసిన సమయంలో అందరూ ఇండ్లకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఏమి జరిగిందో ఏమోగాని రెండవ అంతస్తులో ఉన్న తనీష్‌రెడ్డి ప్రమాదవశాత్తు కిందపడుతూ అప్పుడే అక్కడినుండి వెళుతున్న ఓ వ్యక్తిపైన పడ్డాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన తనీష్‌రెడ్డిని పాఠశాల సిబ్బంది ఆస్పత్రికి తరలించగా చేతికి, వెన్నుముకకు తీవ్ర గాయాలు ఉన్నట్లు, అతని పరిస్థితి బాగాలేదని డాక్టర్లు వెల్లడించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ప్రమాదవశాత్తు జరిగిందా, ఆత్మహత్యకు పాల్పడ్డాడా లేదా మరేవైనా కారణాల వల్లనా, అనేకోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై పాఠశాల డైరెక్టర్ యశస్వినిని తెలిపిన వివరాల ప్రకారం.. విద్యార్థి పాఠశాల ముగియగానే తొందరలో తాళం వేసిన గేటుపై నుండి వెళ్ళి చిన్న సందు ద్వారా భవనంపై నుండి దూకగా ఓ టీచర్‌పై అతడు పడ్డాడు. ఇదంతా సీసీ కెమెరాల్లో రికార్డు అయిందని, ఈ క్రమంలో ఉపాధ్యాయురాలికి సైతం చేయి విరిగింది. అతడు క్షేమంగానే ఉన్నాడని చెప్పడం గమనార్హం.

రేపు కురుమల ఆత్మగౌరవ భవనం ప్రారంభం

తార్నాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14న కోకాపేట్‌లో దొడ్డి కొమరయ్య కురుమల ఆత్మగౌరవ భవనం ప్రారంభించనున్నారు. ఈ మేరకు గురువారం తెలంగాణ రాష్ట్ర కురుమ విద్యార్థి సంఘం నాయకులు ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కురుమ విద్యార్థి సంఘం నాయకులు కమలాకర్, డాక్టర్ ఏలేందర్ మాట్లాడారు. దొడ్డి కొమరయ్య కురుమల ఆత్మగౌరవ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులు రేవంత్‌రెడి, సిద్దిరామయ్య, హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.



బౌద్ధనగర్‌లో జరుగుతున్న సీవరేజ్ పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్‌లో కార్పొరేటర్ పర్యటన

బౌద్ధనగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ రోడ్డునెంబర్-6 లో జరుగుతున్న సీవరేజ్ పైపులైన్ పనులను గురువారం కార్పొరేటర్ కందిశైలజ పరిశీలించారు. సీవరేజీ పైపులైన్ పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను కోరారు. సుమారు రూ.7లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టామని తెలిపారు. నాయకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలపై కేబినెట్ నిర్ణయం హర్షదాయకం : రవిప్రసాద్‌గౌడ్

బౌద్ధనగర్, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలపై కేబినెట్ నిర్ణయం హర్షదాయకమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవి ప్రసాద్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన వారాసిగూడలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాముఖ్యమైన 'వన్‌నేషన్ వన్ ఎలక్షన్' బిల్లుపై కీలక నిర్ణయం తీసుకుందని, యూనియన్ కేబినెట్ ఈ బిల్లుకు ఆమోదం తెలిపిందన్నారు. దేశప్రజల కోసం కేంద్రం తీసుకుంటున్న ఈ కీలక నిర్ణయం గొప్ప ముందడుగు అన్నారు.

రైల్వేలో ప్రీక్రిస్మస్ వేడుకలు

చిలకలగూడ, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): ఏసు క్రీస్తు బోధనలు ఆచరణీయమని రెవరెండ్ డా. జాన్ వెస్లీ (రాజమండ్రి) తెలిపారు. మెట్టుగూడ డివిజన్ రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో దక్షిణ మధ్య రైల్వే క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డా.జాన్ వెస్లీ సందేశం ఇవ్వగా భక్తులు ఏసుక్రీస్తును స్మరిస్తూ గానం చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా రాష్ట్ర ఆరోగ్య శాఖ, కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగుతు, అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఆర్. అభిషేకనంద రావు, కార్యదర్శి బెన్‌హర్, నారాయణ, బిక్షీరాంబబుతో పాటు రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.



కలుసుకున్న 1980 బ్యాచ్ విద్యార్థులు

గుర్తుకొస్తున్నాయి..

చిలకలగూడ, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, సికింద్రాబాద్ 1980 సంవత్సరంలో బీఎస్సీ చదివిన వారు గురువారం సికింద్రాబాద్‌లో కలుసుకుని 44 ఏళ్ల క్రితం గడిపిన అనుభూతులు, అనుభవాలు గుర్తు చేసుకుని ఫోన్లలో ఫొటోలు తీసుకుని ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో ఉదయ్ శంకర్, శ్రీనగేష్,సంతోష్, శ్రీధర్ పాల్గొన్నారు.

18న ఓయూలో కృతజ్ఞత సభ

- కోటూరి మానవతారాయ్

తార్నాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ నెల 18న ఓయూలో కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నామని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్ తెలిపారు. తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ రూం నంబర్ 57లో 'కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్‌రెడ్డి ఏడాది పాలన' అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను గురువారం నిర్వహించారు. దాదాపు 200 మంది విద్యార్థులు వ్యాసరచన పోటీలలో పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ. 10వేలు, ద్వితీయ బహుమతి రూ. 5 వేలు, తృతీయ బహుమతి రూ. 3 వేలు నగదు బహుమతులను ఈ నెల 18న కృతజ్ఞత సభలో అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు డా. వరంగల్ రవి, రెడ్డి శ్రీను, బోనాల నగేష్, భీమ్‌రావ్ నాయక్, పెరుమాళ్ళ గుట్టయ్య గౌడ్, భైరు నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.